క్లుప్తంగా

చెక్కు అందజేత

మణుగూరుటౌన్: అన్ని వర్గాల సంక్షేమం కాంక్షించే పార్టీ ఒక్క కాంగ్రెస్ మాత్రమేనని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ప్రభుత్వం నుంచి మంజూరైన అశోక్‌నగర్‌కు చెందిన ఎస్‌కె.రేష్మ మౌలానాలకు షాదీముబారక్ చెక్కును ప్రజా భవన్ కార్యాలయంలో ఆయన అందజేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడారు. నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, బాబ్‌జానీ, పాతూరి వెంకన్న, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కరకగూడెం వైస్ ఎంపీపీగా శైలజ

కరకగూడెం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. ఇద్దరు ఎంపీటీసీలతో కలసి ఏకగ్రీవంగా కరకగూడెం ఎంపీటీసీ ఎలిపెద్ది శైలజను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు నియామక పత్రాన్ని ఎన్నికల అధికారి సైదుల్ రెడ్డి అందజేశారు. ఇదివరకు వైస్ ఎంపీపీగా ఉన్న పఠాన్ అయ్యుబ్ ఖాన్ 3 సంవత్సరాల క్రితం అకాలమరణం చెందడంతో అప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్నిక నిర్వహించలేదు. తాజాగా ప్రభుత్వ ఆదేశాలతో ఎన్నికను చేపట్టారు. వైస్ ఎంపీపీగా ఎన్నికైన శైలజాకు ఎంపీపీ రేగా కాళికా, ఎంపీటీసీ ఎల్లబోయిన మునింద్ర, కోఆప్షన్ సభ్యులు షేక్ సోందుపాషాతోపాటు పలువురు నాయకులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ రవాణాను అడ్డుకుంటాం

పినపాక: ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేస్తామని తహసీల్దార్ సూర్యనారాయణ తెలిపారు. బుధవారం బయ్యారం క్రాస్ రోడ్‌లో పోలీసులతో కలిసి చెక్ పోస్టును ఏర్పాటుచేసి ఇసుక లారీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల నిరవధిక సమ్మె

కరకగూడెం: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టల్స్ లో పనిచేస్తున్న వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెను బుధవారం చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలలో చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల నాయకుడు కొమరం కాంతారావు మాట్లాడుతూ.. డైలీవేజ్, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు చర్ప సత్యం, యువజన నాయకులు సాయి పాపారావు, హాస్టల్ వర్కర్లు పాల్గొన్నారు.

పాలాభిషేకం..

అన్నపురెడ్డిపల్లి: ఆరు గ్యారెంటీ పథకాల్లో భాగంగా రాష్ట్రంలో గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చిత్రపటాలకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతిహామీని నెరవేరుస్తుందన్నారు. పేద ప్రజల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు వనమా గాంధీ, పర్సా వేంకటేశ్వర్లు,లక్ష్మారెడ్డి, రాము, కల్లోజి నర్సింహారావు, పద్మ, పూర్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం

మణుగూరుటౌన్: మండలంలోని గుట్టమల్లారంలోని గాయత్రీదేవి ఆలయం 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆలయ వ్యవస్థాపకులు ధర్మకర్త అక్కినేపల్లి వసంతాచార్యులు, అక్కినేపల్లి ప్రదీప్ శాస్త్రిలు శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించగా, భక్తులు పెద్దఎత్తున హాజరై తిలకించారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించి పల్లకీ సేవ నిర్వహించారు.

సహకరించండి..

చండ్రుగొండ: గ్రంథాలయ భవన నిర్మాణానికి సహకరించాల్సిందిగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు గ్రంథాలయ సాధన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందించారు. ప్రధాన సెంటర్‌లో నిరుపయోగంగా ఉన్న పీహెచ్‌సీ స్థలాన్ని గ్రంథాలయ భవన నిర్మాణానికి కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాయి రాజా, యండి.ఖాజాహుసేన్, చాపలమడుగు వెంకటేశ్వర్లు, తాతారావు, శంకర్ పాల్గొన్నారు.

నాయకుల సంతాపం

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని పీకే-1 సెంటర్‌లో ధనుగురి స్వాతి మంగళవారం ఆత్మహత్య చేసుకోగా.. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు బుధవారం వారి ఇంటికి వెళ్లి స్వాతి మృతదేహాన్ని సందర్శించారు. ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ.. కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంతాపం తెలిపిన వారిలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శివ సైదులు, కురం రవి, పెనుగొండ సాంబశివరావు, జర్పుల జగన్, పి.నాగేశ్వరరావు, పి.వెంకన్న, డి.మధు, రాంరెడ్డి, సతీష్, నరసింహారావు ఉన్నారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేయడంతో విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ప్రతీ విద్యార్థిని సిబ్బంది తనిఖీచేసి లోనికి పంపించారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా తాగునీటి సౌకర్యంతో పాటు వైద్య సిబ్బందిని నియమించారు. అధికారులు కేంద్రాలను తనిఖీ చేశారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష కొనసాగింది. ఆయా పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను అధికారులు మూసివేయించారు. – సాక్షి నెట్‌వర్క్


మణుగూరుటౌన్: పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు


అశ్వారావుపేటరూరల్: నోటీస్ బోర్డులో హాల్ టికెట్ నంబర్లు చూస్తున్న విద్యార్థులు


చర్లరూరల్: పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు


భద్రాచలంటౌన్: పరీక్ష కేంద్రంలోకి వెళ్తూ..


మణుగూరుటౌన్: విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు


పినపాక: విద్యార్థులను తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమతిస్తున్న సిబ్బంది


గుండాలలో..


చండ్రుగొండ: కేజీబీవీ పరీక్ష కేంద్రంలో..


అశ్వాపురం: జూనియర్ కళాశాలలో..


ములకలపల్లిలో..


పరీక్ష గదిలో విద్యార్థులు


దుమ్ముగూడెంలో..

తాగునీటికి విద్యార్థుల అవస్థలు

అశ్వాపురం: మండల పరిధిలోని బట్టీలగుంపు గ్రామ పంచాయతీలోని మారుమూల గ్రామమైన రామ్‌నగర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. పాఠశాల ఆవరణలోని చేతిపంపు పనిచేయకపోవడమే ఇందుకు కారణం. దీంతో భోజనాల సమయంలో అందకుండా ఉన్న మిషన్‌భగీరథ పైపు వద్ద విద్యార్థులు ఇబ్బంది పడుతూ మంచి నీరు తాగుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చేతిపంపు మరమ్మతులు చేపడితే విద్యార్థులకు తాగునీటి కష్టాలు తీరుతాయి.


పాఠశాలలో భగీరథ పైప్ ద్వారా నీళ్లు తాగుతున్న విద్యార్థులు

వీల్‌చైర్ల పంపిణీ


దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ పరిధిలో సాయినగర్‌లో ఉన్న సాయిబాబా ఆలయంలో డిస్ట్రిక్ట్ ఎస్ఆర్ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం 15మంది దివ్యాంగులకు వీల్‌చైర్‌లను మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి, ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ బయ్యన బాబురావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం కార్యక్రమాన్ని నిర్వహించిన పూజారి, సామాజికవేత్త గిరిని శాలువాతో సన్మానించి జ్ఞాపికతో సత్కరించడంతో పాటు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఎస్ఆర్ఐ ఫౌండేషన్ ప్రతినిధి ఉపాధ్యాయుడు తుక్కాని శ్రీనివాస్‌రెడ్డి, విస్సావజ్జల శేషగిరిశర్మ, ఆలయ కమిటి సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, కట్ల నరేష్, సాయి ప్రసాద్, రాంబాబు, మాధవాచారి, సంతోస్‌కుమార్ శర్మ, బండారి వెంకన్న పాల్గొన్నారు.

సైకిళ్లు అందజేత

బూర్గంపాడు: మండల పరిధిలో నాగినేనిప్రోలు రెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థినులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. వెల్నెస్ ప్రాజెక్ట్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో వేయిమంది విద్యార్థినులకు వేయి సైకిళ్లను అందిస్తున్నట్లు తెలిపారు. నాగినేనిప్రోలు గ్రామంలో మార్చి 16, 17 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరి ఆరోగ్య స్థితిగతుల సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బూసిరెడ్డి అన్నపూర్ణ, హెచ్ఎమ్ యధుసింహరాజు, డాక్టర్ రమేష్‌బాబు, మంగళగిరి హనుమంతరావు, దేవంగి రామచంద్ర, సూరెడ్డి చందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

అశ్వాపురం: మండల కేంద్రంలో బీపీసీ పెట్రోల్ బంక్ సమీపంలో బైక్, స్కూటీ ఢీకొని ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్కూటీపై మహిళ మరొకరితో కలిసి అశ్వాపురం వైపు వస్తుండగా పల్సర్ బైక్‌పై ఓ వ్యక్తి తోగ్గూడెం వెళ్తున్నాడు. అశ్వాపురంలో బైక్, స్కూటీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో తోగ్గూడెంకు చెందిన కొమరం జానీ, జగ్గారం గ్రామానికి చెందిన మహిళ, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై తిరుపతిరావు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు.

మొండికుంటలో..

మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన కొల్లు సత్తిరెడ్డి, పద్మ స్కూటీపై మొండికుంట సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా పాల్వంచ వైపు వెళ్తున్న బైక్ స్కూటీని ఢీకొట్టడంతో పద్మకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

అశ్వాపురం: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కను హైదరాబాద్‌లో మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ అశ్వాపురం మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు కలిశారు. మేడారం జాతర సందర్భంగా సీతక్క అందించిన సేవలను అభినందిస్తూ నాయకులు సమ్మక్క-సారలమ్మ ప్రతిమతో కూడిన జ్ఞాపికను మంత్రికి బహూకరించారు. అశ్వాపురం మండల వ్యాప్తంగా గ్రామాల్లో రైతులు పొలాలకు వెళ్లే డొంక రహదారులు అధ్వానంగా ఉన్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించినట్టు భిక్షమయ్య తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నంబూరి వెంకన్న, రాగి అరుణాచారి, న్యాయవాది భజన సతీష్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అశ్వాపురం: మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీ గేట్ ఎదురుగా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం టైలర్స్‌డే వేడుకలు నిర్వహించి జెండా ఎగురవేశారు. అనంతరం టైలర్స్ అసోసియేషన్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు, అధ్యక్షుడిగా అజయ్, ఉపాధ్యక్షుడిగా గద్దల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కొమరయ్య, సహాయ కార్యదర్శిగా ఎస్‌కె.భాష, కోశాధికారిగా రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మేకల అంజిబాబు, అశోక్, కిరణ్, భారీ, సుభాని పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మహాజన సమితి మహిళా మండల అధ్యక్ష, కార్యదర్శులుగా కుంజ దేవిశ్రీ , ఈసం పల్లి శృతిలయను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాటిబోయిన కనక, పెదపాటి కామాక్షిలు ఆదేశాలు జారీ చేశారు.

కొనసాగుతున్న జాతరల కోలాహలం

ములకలపల్లి: మూకమామిడి వద్ద రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయ పరిసరాల్లో మూడు రోజులు నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతర రెండో రోజైన మంగళవారం భక్తి భావంతో కొనసాగింది. ప్రధాన ఒడ్డెర, స్థానిక పూజారి సడియం నాగేంద్రబాబు ఆధ్వర్యంలో ఆలయ ప్రదక్షణ కార్యక్రమాలు చేశారు. గిరిజన సాంప్రదాయ పద్ధతిలో రాత్రివేళ గ్రామపొలిమేరల నుంచి సారలమ్మలను గద్దెలకు తోడ్కొనివచ్చారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొని పూజలు నిర్వహించారు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ అంజి పాల్గొన్నారు.

మారాయిగూడెం జాతర..

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెం గ్రామంలో జరుగుతున్న సమ్మక్క-సారలమ్మ జాతర రెండో రోజు బుధవారం కొనసాగింది. సారాలమ్మను మేళాతాళాలతో కోయవారి నృత్యాలతో అఖండ భక్తజన సందోహం నడుమ గద్దెలపైకి తీసుకుని వచ్చారు. ఈ సమయంలో భక్తులకు దేవర రావడంతో సందడి నెలకొంది. దేవర బాలలు సోడి శాంతమ్మ, అచ్చమ్మలు జాతరకు వచ్చిన భక్తులకు ఆశీర్వదనం అందచేశారు.

కట్టమైసమ్మ జాతర..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామ శివారులోని కట్టమైసమ్మ తల్లి ఆలయంలో బుధవారం నుంచి 13వ వార్షిక జాతర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు రెండు రాష్ట్రాలకు చెందిన భక్తులు తరలి వచ్చి పాల్గొంటారు. జాతర ఉత్సవాల సందర్భంగా ఆలయానికి, రహదారికి ఇరువైపులా విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రి సమయంలో ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.


ముకలపల్లి: సారలమ్మను గద్దెలపైకి తోడుకొని వస్తున్న భక్తులు


దుమ్ముగూడెం: అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

విజయ భవాని జాతర..

మండలంలోని నారంవారిగూడెం కాలనీ గ్రామంలోని విజయ భవాని అమ్మవారి ఆలయం నిర్వహిస్తున్న జాతర ఉత్సవాలు బుధవారం రాత్రితో ముగిశాయి. పలు పూజా కార్యక్రమాలతో భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించగా.. స్థానిక ఎస్సై శ్రీరాముల శ్రీను కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాత్రి సమయంలో ఆలయం వద్ద జానపద నృత్యాలు ఏర్పాటు చేశారు.

నేడు సన్నాహక సమావేశం

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గస్థాయిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సభను జయప్రదం చేయాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోరారు. బుధవారం మండల కేంద్రం, దమ్మపేట గ్రామ శివారులోని మల్లారం రోడ్డులోని వ్యవసాయ క్షేత్రంలో మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గురువారం (నేడు) దమ్మపేటలోని వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించనున్న పార్లమెంటు ఎన్నికల సన్నాహక సభకు ముఖ్య అతిథులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అలపాటి ప్రసాద్, రావు గంగాధరరావు, చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు, అత్తూలూరి వెంకటరామారావు, యర్రగొర్ల రాధకృష్ణ, సాయిల నర్సీ, కెవి సత్యనారాయణ, ఎర్రా వసంతరావు, రావు రవిశంకర్, గోపిశాస్త్రి, చిట్టిబాబు, రొయ్యల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకుని నేడు దమ్మపేటలో నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. చండ్రుగొండలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు. నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, దారం గోవింద రెడ్డి, ఉప్పతల ఏడుకొండలు, టి.సురేష్, ఇంజం అప్పారావు, కేశబోయిన నర్సింహారావు, ఎస్డీ సైదా, బడుగు కృష్ణవేణి, బాణోత్ రాముడు, మనోహర్, అంతటి రామకృష్ణ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

గుండాల: మూడు విప్లవ పార్టీలు ఐక్యమై మార్చి 3, 4, 5వ తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ప్రజాపంథా ఇల్లెందు డివిజన్ నాయకులు ఈసం శంకర్, జిల్లా నాయకులు వాంకుడోత్ అజయ్‌లు కోరారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో ప్రజాపంథా మాస్‌లైన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరం శాంతయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బొర్ర వెంకన్న, మంగయ్య, కుమార్, ఆజాద్, సింగన్న, లక్ష్మన్న, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: జాతీయ ఐక్యత మహాసభలను జయప్రదం చేయాలని బుధవారం ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని వినాయకపురం గ్రామంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ పాల్వంచ డివిజన్ నాయకుడు గోగినపల్లి ప్రభాకర్ జెండా ఊపి బైక్ ర్యాలీను ప్రారంభించగా.. ఊట్లపల్లి మీదుగా అశ్వారావుపేట వరకు ఈ ర్యాలీ సాగింది. నాయకులు కంగాల కల్లయ్య, ధర్మల శ్రీరాములు, కారం మల్లేష్, కుంజా అర్జున్, లక్ష్మణ్‌రావు, రామకృష్ణ పాల్గొన్నారు.

తునికాకు టెండర్లు వేయాలి

గుండాల: జిల్లా వ్యాప్తంగా తునికాకు కాంట్రాక్టర్లతో టెండర్లు వేయించి వెంటనే ప్రూనింగ్ పనులు చేపట్టాలని ఎంపీపీ ముక్తి సత్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎన్డీ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో డీఆర్ఓ బాలాజీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వాగబోయిన రామక్క, కొమరం సీతారాములు, అరెం నరేష్, యాసారపు వెంకన్న, పర్శక రవి, గడ్డం లాలయ్య, లాలు, బుచ్చయ్య పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన తమ్మళ్ళ మాణిక్యమ్మను మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి కొండా చరణ్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాణిక్యమ్మ మృతి చెంది రోజులు గడుస్తున్నా నిందితులను పట్టుకోవడంలో పోలీసులు వైఫల్యం చెందారని విమర్శించారు.

జాతీయ సైన్స్ దినోత్సవం

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు పాఠశాలల్లో కార్యక్రమాలను నిర్వహించారు. పలు పాఠశాలల్లో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సైన్స్ ఫేర్ కార్యక్రమాలు ఏర్పాటు చేయగా.. విద్యార్థులు సైన్స్ కృత్యాలను ప్రదర్శించారు. ఆయా ప్రాంతాల్లో అతిథులుగా హాజరైనవారు వాటిని పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. చిన్నారులు రూపొందించిన నమూనాలు ఆలోచింపజేశాయి. ఆపై కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్


సైన్స్ ఫేర్‌లో విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ


అశ్వారావుపేటరూరల్: విజ్ఞాన ప్రదర్శనలో ఎగ్జిబిట్లతో విద్యార్థులు


బూర్గంపాడు: విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు


కరకగూడెం: సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం


భద్రాచలంటౌన్: సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న హెచ్‌ఎం రమణ


చండ్రుగొండ: విద్యార్థులు రూపొందించిన మోడళ్లను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు


మణుగూరురూరల్: 'ఎక్స్‌లెంట్' పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులకు సన్మానం..